# సదుపాయాలు

'క్షేమయ్యా?'

'ప్రభూ!'

'ఇది చూశావా?'

'............?'

'ఏమిటి చెప్పుకో చూదాం—'

'ఏదో కుత్రిమాకారంగా వుందండి—'

'ఛ! నీకేం తెలుసునోయ్ దీని సంగతీ?'

'చిత్తం—క్షమించాలి. తెలియక మాటాడాను.'

'ఊ! అలా దార్లోకిరా. ఇంతకీ ఇదేమిటో తెలుసా నీకూ?'

'చిత్తం! తెలీదండి.'

'తెలుసుకో వద్దుటోయ్? ప్రపంచంలో ఇలాంటి ఉపయోగకరమైన గొప్పవస్తువు లెన్నివున్నాయ్—అందులో ఇది వొహటి—'

'ఇంతకీ అదేమిటో—?'

'ఇదే—దీన్ని గురించే చెబుతున్నా—దీన్ని ఇంగ్లీషువాడు కని పెట్టాడు—'

'కనపడుతూనే వుందండి దాని వాలకం—'

'దీనితో దొరలు వీపు గోక్కుంటారు—'

'ఒహో! అదాండి సంగతి?'

'వీపు అనేది మహా చెడ్డ వొస్తువు. దానికి మాటిమాటికీ దురద పెడుతూంటుంది—'

'నిజమేనండి—'

'శరీరంలో ఏ భాగాన్నైనా మనం గోక్కోవచ్చునుగాని వీపు గోక్కోవడం అంత సులువు గాదు—'

'గొప్ప సత్యమండి—'

'అందుకని ఇంగ్లీషువాడు ఈ సాధనాన్ని కనిపెట్టేడు—దీనితో వీపు

మీది ఏ భాగానైనా సరే శుభ్రంగా గోక్కొనవచ్చును..'

'బావుందండి.'

'ఇది బ్రిటిషువాడు కనిపెట్టేడవి గాదూ అన్నాను?'

'ఔనండి—మీరు అబద్ధమాడరు.'

'దీన్ని మొదట్లో పాశ్చాత్య దేశాలవారు ఉపయోగిస్తూండే వారు—'

'చిత్తం.'

'రానురాను మనవాళ్లు కూడా—కొంత పెద్ద పెద్ద వాళ్లు—ఉపయోగిస్తున్నారు.'

'అలాగనాండి!'

'అవును. దీనితో వీపు గోక్కుంటారని కాదూ చెప్పానూ?'

'అవునండి!'

'రైట్! మొన్న నేను ఢిల్లీ వెళ్ళినప్పుడు వైస్రాయి కౌన్సిల్లో ఇలాటి వెన్నో కనుపించాయి ప్రతి సభ్యుడికి ఒక్కొక్కటి సప్లయి చేస్తారులే—'

'చిత్తం. భలే ఏర్పాటండి!'

'తీవ్రంగా ఏదైనా చర్చించాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు కౌన్సిలు సభ్యులు దీంతో వీపు గోక్కుంటూంటే శమానుగా వుండి ఆలోచన బాగా సాగుతుంది.'

'చిత్తం.'

'ఇలాంటివి వైస్రాయికి రెండుంటాయి.'

'పెద్దవాడు గనక - కాదండీ?'

'ఔను!'

'సభ్యులికి కూడా కావలసినన్ని సప్లయి చేస్తారులే—ఈ మధ్య దీన్ని ఎక్కువగా ఉపయోగించాల్సిన పరిస్థితులలో చిక్కుకున్న వారిలో జ్వాలా ప్రసాదుగారొకరు.'

'చిత్తం చిత్తం! ఆహార సమస్యండి మాటలామరి?'

'ఆ సమస్య చర్చింపబడుతూండే టప్పుడే నేనూ కౌన్సిలు హాలు చూట్టానికి వెళ్లాను-'

'చిత్తం. మంచి సమయానికి వెళ్లారండి.'

'అప్పుడు నాకు వొద్దంటూన్నా గానీ-'ఇక్కడకు వచ్చినవారికి వీపు తప్పకుండా దురద పెడుతుంది కాబట్టి వొకటి మీాదగ్గర వుంచుకోవడం మంచిది' అంటూ దాన్ని నా చేతిలో పెట్టారు-'

'చాలా మంచివాళ్లండి-'

'దీనితో నీవు ఎంత హాయిగా గోక్కోవచ్చునని!'

'చిత్తం! ప్రభువులకి మహదానంద సిద్ధి.'

'ఇంకా సందేహమా శేషయ్యా? కాని ఓ చిన్న పొరబాటు జరిగి పోయింది-'

'ఏమిటి ప్రభూ!'

'మిగతా వారంతా తమ పని పూర్తి కాగానే ఇవి అక్కడ తమ సీట్లమీాద వొదిలేసి చక్కావొస్తూంటే నేను పొరబాటున-'

'జేబులో వేసుకొచ్చారా?'

'అవును. ఏమన్నా అనుకుంటా రంటావా?'

'ఫరవాలేదండి-ఇంతమాత్రం దానికి. వాళ్ళకి అక్కడ కావలసినన్ని వుంటాయండి!'

'అందుక నేలే నేనూ పట్టుకొచ్చింది. శేషయ్యా?'

'ప్రభూ!'

'నాకు తెలిసినంత మట్టుకు మన సంస్థానంలో దీన్ని ఉపయోగించే వాడిని నే నొక్కణ్ణే-'

'చిత్తం-'

'ఎంత గొప్ప మనకి!'

'చిత్తం! కాని, నాకు తెలిసినంత మట్టుకు దాన్ని ఉపయోగించే వ్యక్తి మరొక్కరు-'

'మరో వ్యక్తి వున్నాడా శేషయ్యా?'

'ఉన్నాడండి !'

'ఎవరో చెప్పు, పేగులు తీసేస్తాను.'

'చిత్తం ! మన టామీ అండి-'

'టామీయా? వెధవ ! దాని కెలా దొరికింది యిలాటిది ?'

'చిత్తం ! దేవిగారు రోజూ ఏమీ తోచనప్పుడు దీన్ని తీసుకువెళ్లి టామీ వీపు గోకుతూంటారండి !'

'శేషయ్యా ?'

'ప్రభూ !'

'ఇది నిజమే అంటావా ?'

'చిత్తం ! నిజమేనండి !'

'అయితే చూడు శేషయ్యా ? మన టామీయే అయితే ఫరవాలేదు. కాని ఈ సంగతి ఎవరికీ తెలియనీకుడు ?'

'వీపు చిట్లిపోదండీ? అలాంటి పనిచేస్తానా !'

## ఘన పదార్థాలు

'శేషయ్యా?'

'ప్రభూ !'

'ఒక్కొక్కప్పుడు ఎవర్నిగురించి వారు ఆలోచించుకుంటూంటే చాలా విచిత్రంగా వుంటుందిసుమా-'

'చిత్తం వుంటుందండి.'

'నువ్వెప్పుడైనా నిన్నుగురించి నువ్వు ఆలోచించుకు చూసుకున్నావా?'

'చిత్తం-అప్పుడప్పుడు అలా చేస్తూనేవుంటానండి-'

'నిన్నరాత్రి నిన్నుగురించి నువ్వు ఆలోచించుకు చూసుకున్నావా?'

'చిత్తం! చిత్తం ! తమరికెలా తెలిసిందండీ ఈసంగతి?'

'నీ మొహమే చెబుతూంది-'